సాక్షి
వికారాబాద్
ఆదివారం । 20 । ఆగస్టు । 2023



చెరువు నిండా నీరు..

పెద్దేముల్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు అధ్వానంగా తయారైంది. చెరువు నిండా నీరున్నా సాగుకు అందని దుస్థితి. 8లో▸



మాతోనే సంక్షేమ పాలన

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



రెచ్చిపోయిన పిచ్చి కుక్కలు

బొంరాస్‌పేట మండల పరిధిలోని రేగడిమై లారంలో పిచ్చికుక్కలు మరోసారి స్వైర విహారం చేశాయి. 8లో▸

బుజ్జగింపుల పర్వం



బీఆర్ఎస్ అసమ్మతి నేతలకు ఎమ్మెల్యేల ఫోన్ కాల్స్

- దూరమైన వారిని అక్కున చేర్చుకునేందుకు ప్రయత్నాలు
- టికెట్లపై క్లారిటీ రావడంతో గెలుపు వ్యూహాలకు పదును
- ఎటూ తేల్చుకోలేకపోతున్న అసమ్మతి నేతల అనుచరులు

వికారాబాద్: ఇన్నాళ్లు నువ్వో.. నేనో.. తేల్చుకుందాం అంటూ కత్తులు దూసుకున్న ఒకే పార్టీకి చెందిన నేతలు ఇప్పుడు కలిసుందాం రండీ.. అంటూ పలకరింపులకు తెరతీస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఖాయమనే భరోసా రావడంతో వారు గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు బేరసారాలు.. రాయబారాలకు తెరతీస్తున్నారు. తమ నుంచి దూరమైన వారందరినీ తిరిగి ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా మనస్పర్థలు వీడి కలసి పనిచేద్దాం రండి అంటూ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు అసమ్మతి వర్గం నేతలకు ఫోన్లు చేస్తున్నారు. ముందులాగే తమతో కలిసి నడవాలని కోరుతున్నారు. అసమ్మతి నేతలు కలసి రాకుంటే గెలుపు కష్టమే నన్న అంచనాకు వచ్చిన సిట్టింగులు వారిని తమవైపు తిప్పుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్టీలో ఉండేదెవరు.. వీడేదెవరు

గడిచిన మూడేళ్లలో అధికార పార్టీకి గతంలో ఎప్పుడూ లేనంత అసమ్మతి వర్గం పెరిగిపోయింది. జిల్లాలో పార్టీకి విధేయులుగా ఉంటూనే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా అసమ్మతి కుంపటి రాజేశారు. తాండూరులో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి రూపంలో అసమ్మతి వర్గం పురుడుపోసుకుంది. అది కాస్త జిల్లా మొత్తం వ్యాపించింది. జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర విద్యా మౌలిక వనరుల కల్పనా సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు కొండల్‌రెడ్డి, మురళీకృష్ణగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నందు, కృష్ణ, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితర నేతలు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా జట్టుకట్టారు. కాగా ఇందులో గురునాథ్‌రెడ్డి, మురళీకృష్ణగౌడ్ ఇప్పటికీ పార్టీ వీడి ఒకరు హస్తం గూటికి, ఇంకొకరు కమలం గూటికి చేరారు. మిగతా అసమ్మతి నేతల్లో ఎవరెవరు పార్టీ వీడతారు..ఎవరెవరు బాధల్ని దిగమింగుతూ ఎమ్మెల్యేలతో జతకడతారనే విషయం తెలియాల్సి ఉంది.

అయోమయంలో అసమ్మతి నేతలు

ఎవరెవరికి టికెట్లు ఇవ్వడం లేదనే విషయాన్ని అసమ్మతి వర్గ నేతలకు అధిష్టానం స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాము కచ్చితంగా పోటీలో ఉండితీరుతామని అనుచరులకు చెబుతూ వచ్చిన నేతలు ఇప్పుడు ఏ స్టాండ్ తీసుకోవాలో తెలియని ఆయోమయ స్థితిలోకి వెళ్లారు. అయితే ఇందులో కొందరు ఆశావహులు పక్క పార్టీలవైపు చూస్తుండగా, మరికొందరు పార్టీలోనే ఇంకా టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



5కే రన్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అధికారులు, విద్యార్థులు

ఓటు వజ్రాయుధం

- ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- 5కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ఓటు వజ్రాయుధంతో సమానమని, దాన్ని సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఎన్నేపల్లి ఎక్స్ రోడ్డు నుంచి ఆలంపల్లి ఎక్స్ రోడ్డు వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ కోటిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడికి లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. నవంబర్ లేదా డిసెంబర్ మాసాల్లో అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆగస్టు 21, సెప్టెంబర్ 19న ఓటు హక్కు పొందేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా 5కే రన్‌లో యువతి, యువకులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు మన బాధ్యత: అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది మన బాధ్యత అని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని అంగడి బజార్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నేను కచ్చితంగా ఓటు వేస్తాను.. అనే నినాదంతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, అధికారులు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 21న ఓటరు డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామన్నారు. అందులో తప్పులు ఉంటే సరి చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 26, 27 తేదీల్లో ఓటు హక్కుపై ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేష్, శ్రీనివాస్, పాండు, జయరాం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, సీడీపీఓ జయరాం, ఎంఈఓ రాంరెడ్డి, ఎస్ఐ గోపాల్, ఎలక్షన్ డీటీ శివకుమార్, డీటీ సురేష్, వార్డెన్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కోర్టుల చుట్టూ తిరగొద్దు



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

వికారాబాద్ అర్బన్: చిన్నచిన్న గొడవలకు కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగరాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే సుదర్శన్ కక్షిదారులకు సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఎస్పీ కోటిరెడ్డి, ఇతర పోలీసు అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కేసులు రాజీ పడేలా చూడాలన్నారు. క్రిమినల్ కేసులు, భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వెహికల్ ప్రమాద కేసులు వంటివి రాజీ పడవచ్చునని తెలిపారు. సమావేశంలో ఒకటవ అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి కే శ్రీకాంత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజేశ్వర్, అన్వేష్ సింగ్, సమీనా బేగం, వికారాబాద్ డీఎస్పీ కే నర్సింలు, తాండూర్ డీఎస్పీ జీ శేఖర్ గౌడ్, ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

'సుపరి పాలన'కు ఆహ్వానం



చీమల్‌దరి సర్పంచ్ నర్సింహారెడ్డి

మోమిన్‌పేట: 'పంచాయతీల్లో సుపరిపాలన' అంశంపై శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి వర్క్‌షాపులో ప్రసంగించాలని కోరుతూ చీమల్‌దరి సర్పంచ్ నాసన్‌పల్లి నర్సింహారెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఖాలిద్ మజీద్ నుంచి శనివారం ఇన్విటేషన్ వచ్చింది. ఈ నెల 21 నుంచి 23 వరకు కొనసాగే వర్క్‌షాప్‌లో నర్సింహారెడ్డి పాల్గొననున్నారు. బెస్ట్ గవర్నెన్స్ విభాగంలో చీమల్‌దరి ఇటీవలే జాతీయ ఉత్తమ పంచాయతీగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గ్రామంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించేందుకు తనకు ఆహ్వానం వచ్చిందని నర్సింహారెడ్డి తెలిపారు.

అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు

ఆర్టీసీ డీఎం సమత

తాండూరు టౌన్: హైదరాబాద్ నుంచి ఈ నెల 29వ తేదీ రాత్రి 9గంటలకు టీఎస్ ఆర్టీసీ బస్సు తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి బయలుదేరుతుందని తాండూరు ఆర్టీసీ డీఎం సమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 29వ తేదీ రాత్రి బయలుదేరి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు అక్కడి నుంచి బస్సు బయలుదేరి సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 4 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, జేబీఎస్‌ల మీదుగా బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ఆన్‌లైన్, జంట నగరాల్లోని ఏటీబీ ఏజెంట్ల వద్ద సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. దర్శనం, అల్పాహారం, భోజనం ,వసతి సదుపాయాలను భక్తులే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 9959226257, 9959224911(ఎంజీబీఎస్), 9959226246(జేబీఎస్)లో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. శనివారం మండలంలోని కోట్‌మర్పల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు మెంబర్ పూలమ్మ, బీజేపీకి చెందిన రమేష్, బీఎస్పీకి చెందిన ఉస్మాన్‌తో పాటు మరో 80 మంది బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాచయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, మండల యూత్ కార్యదర్శి జైహింద్‌రెడ్డి, కోట్‌మర్పల్లి గ్రామ అధ్యక్షుడు తహసీన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రఘుపతిరెడ్డి, వార్డు మెంబర్లు కృష్ణగౌడ్, నర్సింలు, శ్రీశైలం, గోరేమియా, కిష్టయ్య, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

దొరల ఉచ్చులో చిక్కకండి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యమూర్తి

- పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపన వెనుక కుట్ర
- నాడు కూల్చి.. నేడు ఏర్పాటు చేశారు
- బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ సత్యమూర్తి

తాండూరు టౌన్: బహుజనుల ఐక్యతను దెబ్బతీసేందుకు దొరలు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకోరాదని బహుజన్ సమాజ్ పార్టీ తాండూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ డీ సత్యమూర్తి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని బీసీలు నాయకులుగా ఎదుగుతున్నారనే అక్కసుతో అగ్రవర్ణాల నాయకులు తమను విడగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఇటీవల పట్టణంలోని పాట్లి మహరాజ్ ఆలయం వద్ద హడావుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్ఠాంచారని పేర్కొన్నారు. రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అదే స్థలంలో పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెను కూల్చివేశారని తెలిపారు. అప్పట్లో విగ్రహ ఏర్పాటుకు అడ్డు వచ్చిన నిబంధనలు ఇప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని బీసీలు గమనించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు 60 నుంచి 70 స్థానాల్లో ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని బీఎస్పీ నిర్ణయం తీసుకుందన్నారు. సమావేశంలో నాయకులు జగదీశ్వర్, నవీన్‌కుమార్ యాదవ్, కృష్ణయ్య గౌడ్, అమ్జద్‌అలీ, సల్మాన్, రమేష్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పోరాడుతాం

- లీప్స్ అధ్యక్షుడు భూమి సునిల్‌కుమార్

మంచాల: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని లీప్స్ (లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ) అధ్యక్షుడు భూమి సునిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆరుట్లలో శనివారం లీప్స్ గ్రామీణ న్యాయ పీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఆధ్వర్యంలో భూ న్యాయ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 20 గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. భూ రికార్డులను ధరణిలో తప్పులతడకగా నమోదు చేశారని.. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ చట్టాలను సమీక్షించి ఒకేఒక 'టైటిల్ గ్యారంటీ చట్టం' తేవాలన్నారు. ఏపీలో ఈ చట్టం అమలు కోసం అసెంబ్లీలో కూడా ఆమోదం తెలిపారని, గవర్నర్ ఆమోదం కోసం పంపించారని గుర్తు చేశారు. తెలంగాణలోనూ భూ సమస్యలు పరిష్కారం కావాలంటే ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతి శనివారం 'న్యాయగంట' పేరుతో సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు రైతులకు ఉచిత న్యాయ సలహాలు అందించనున్నట్లు చెప్పారు. రైతులు 90002 22674 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు పొందొచ్చని సూచించారు. రైతుల సమస్యలు తెలుసుకొని హైకోర్టు న్యాయ వాదుల సహకారంతో 33 జిల్లాల్లో 100 సాగు న్యాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరుట్లలోనూ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వం, ప్రతిపక్షాలకు ఒక భూ మేనిఫెస్టో తయారు చేసి ఇస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్‌దేశాయ్, లీప్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, న్యాయవాదులు మల్లేష్, రవి, సందీప్, అభిలాష్, కరుణాకర్, దయాకర్, ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూ న్యాయ శిబిరంలో మాట్లాడుతున్న సునిల్‌కుమార్

పిల్లల చదువుపై శ్రద్ధ వహించండి

- అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి
- తల్లిదండ్రులకు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ సూచన

పరిగి: పిల్లల చదువుపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని కాళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పాల్గొని మాట్లాడారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లల స్థితిగతులను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలసి పాఠశాలలో అభ్యాసనను మెరుగుపరచుకోవాలని సూచించారు. పాఠశాలలో చెప్పిన పాఠ్యాంశాలను ఇళ్ల వద్ద తల్లిదండ్రులు చదివించాలన్నారు. నిత్యం ఇలా చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు బోధన చేస్తారని తెలిపారు. విద్యార్థుల పురోగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. అప్పుడు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, ఎంఈఓ హరిశ్చందర్, సర్పంచ్ జంగయ్య, ఎస్ఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, హెచ్ఎం వీణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్‌పీడీ రమేష్

అమ్మ కడుపు చల్లగా..

గాంధీ ఆస్పత్రిలో తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రం నేడు ప్రారంభం






ప్రారంభానికి సిద్ధమైన ఎంసీహెచ్ భవనం

- అందుబాటులోకి 200 సూపర్ స్పెషాలిటీ పడకలు
- ఆధునిక సదుపాయాలు, అత్యాధునిక వైద్య యంత్రాలు
- రాష్ట్రంలో హైరిస్క్ ప్రసవాలకు కేంద్ర బిందువు
- తగ్గనున్న మాతాశిశు మరణాలు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): మహిళకు మాతృత్వం దేవుడిచ్చిన వరం. నవమాసాలు మోసిన శిశువు పురిట్లోనే మృతి చెందితే ఆ తల్లి పడే ఆవేదన వర్ణనాతీతం. మరికొన్ని ఘటనల్లో శిశువు పుట్టిన వెంటనే తల్లి మరణిస్తోంది. హైరిస్క్ ప్రసవాలకు కేంద్రబిందువుగా నిలిచి తల్లీబిడ్డలను అక్కున చేర్చుకునేందుకు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆదివారం నుంచి అందుబాటులోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) రూ. 60 కోట్ల వ్యయంతో నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ, ఆధునిక వసతులు, అత్యాధునిక వైద్యయంత్రాలతో గర్భిణులు, బాలింతలు, శిశువులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. నేటి ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఎంసీహెచ్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.



అత్యాధునిక ఆపరేషన్ థియేటర్

మాతాశిశువులకు అభయహస్తం

గ్రౌండ్ ప్లస్ ఏడు అంతస్తుల్లో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రెండు వందల పడకలు అదనంగా అందుబాటులోకి వస్తాయి. సుమారు రూ.10 కోట్లతో ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, వైద్యయంత్రాలను సమకూర్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడతారు. నవజాత శిశువుల కోసం మదర్ మిల్క్ బ్యాంకు, కంగారు మదర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాలను ఎంసీహెచ్ భవనంలోకి తరలించి, తల్లీ బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. న్యూరాలజీ, యూరాలజీ వార్డులను అదనంగా ఏర్పాటు చేశారు. గైనకాలజీ, పీడియాట్రిక్, అనస్థీషియా వంటి అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతం అందుబాటులో ఉంటారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ప్రస్తుతం రెట్టింపు అవుతాయని ఆస్పత్రి వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

ఐదో అంతస్తులో ఫెర్టిలిటీ సెంటర్

పిల్లల కోసం తల్లడిల్లే వారికి ఎంసీహెచ్ భవనంలోని అయిదో అంతస్తులో ఫెర్టిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక వైద్య యంత్రాలను సమకూర్చారు. ప్రైవేటు ఫెర్టిలిటీ సెంటర్లు లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయని, గాంధీ ప్రభుత్వ ఫెర్టిలిటీ సెంటర్‌లో పైసా ఖర్చు లేకుండా మాతృత్వపు రుచి చూపిస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

ఆధునిక హంగులతో డైట్ క్యాంటీన్ భవనం

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.2.75 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో నిర్మించిన డైట్ క్యాంటిన్ భవనాన్ని మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులతో పాటు సేవలు అందిస్తున్న వైద్యులకు డైట్ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటిన్ సమస్య పరిష్కారం కానుంది.

అంతస్తుల వారీగా అందించే వైద్యసేవలు

గ్రౌండ్ ఫ్లోర్:	ఓపీ, ప్రసూతి విభాగాలు, రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్
మొదటి అంతస్తు:	హై డిపెండెన్సీ యూనిట్, లేబర్ డెలివరీ రికవరీ విభాగం
రెండో అంతస్తు:	ఐసోలేషన్ గదులు, లేబర్ డెలివరీ విభాగం
మూడో అంతస్తు:	పేయింగ్ రూమ్స్, యాంటినెటల్ వార్డు
నాలుగో అంతస్తు:	పేయింగ్ రూమ్స్, పోస్టునెటల్ వార్డు
ఐదో అంతస్తు:	ఫెర్టిలిటీ సెంటర్, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయు, కంగారు మదర్ రూమ్ (కేఎంసీ)
ఆరో అంతస్తు:	ఎంఐసీయూ, పోస్టు ఆపరేటివ్ వార్డు
ఏడవ అంతస్తు:	సీఎస్ఎస్‌డీ, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఆపరేషన్ థియేటర్లు



ప్రసూతి వార్డు

తెలంగాణకు మణిమకుటం ఎంసీహెచ్

మదర్ చైల్డ్ హెల్త్ కేర్ (ఎంసీహెచ్) ఆరోగ్య కేంద్రం తెలంగాణకు మణిమకుటం. రాష్ట్రవ్యాప్తంగా హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తాం. ఎంసీహెచ్‌తో గాంధీలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల నేతృత్వంలో తెలంగాణలో ప్రభుత్వ వైద్యం ఎంతో అభివృద్ధి చెంది, సామాన్య ప్రజల నమ్మకాన్ని సాధించింది. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో ఎంసీహెచ్, డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం పూర్తయ్యాయి.

– రాజారావు, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

రేపు మహాధర్నా

కొడంగల్: తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణయ్య, బాల్‌రాజ్, మొగులప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

పూడూరు: కుటుంబ కలహాలతో వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన చన్గోముల్ పీఎస్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చీలాపూర్‌కు చెందిన వడ్డె అంతమ్మ(70) కుమారుడు చంద్రయ్యకు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య మృతి చెందడంతో మంజులను వివాహం చేసుకున్నాడు. ఇటీవల మొదటి భార్య కుమారుడు ఆంజనేయులు, మంజులకు మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 18న మరోమారు తగదా జరగగడంతో మనస్థాపం చెందిన వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లి గ్రామ సమీపంలో చింతచెట్టుకు ఉరేసుకుంది. శుక్రవారం రాత్రి గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

ధారూరు మార్కెట్‌కు పెసళ్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి పెసర పంట వస్తోంది. 120 బస్తాల పెసళ్లు రాగా క్వింటాల్‌కు రూ.7వేల నుంచి రూ.8,600 వరకు ధర పలికింది. ఈ సారి ఎక్కువ మంది రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపడంతో పెసర, మినుము సాగు ఘణనీయంగా తగ్గిపోయింది. మండల వ్యాప్తంగా పెసర కేవలం 206 ఎకరాల్లో, మినుము 35ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మరో వారం రోజుల్లో అమ్మకాలు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు.

చెరువు నిండానీరు పొలం పారని తీరు

రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆయకట్టు కాల్వలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. చెరువు నిండా నీరున్నా సాగునీరందని దుస్థితి ఏర్పడింది. 200 ఎకరాలకు సాగు ఉపయోగపడేలా నిర్మించిన కాల్వలు నిర్వహణలోపంతో 20 ఎకరాలకు కూడా నీరందడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

- నిరుపయోగంగా పెద్ద చెరువు
- మరమ్మతులకు నోచుకోని కాల్వలు
- పట్టించుకోని అధికారులు


పెద్దేముల్ పెద్ద చెరువు

పెద్దేముల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు అధ్వానంగా తయారయింది. చెరువు నిండా నీరున్నా సాగుకు నీరందని దుస్థితి. కాల్వలు అధ్వానంగా మారడంతో ఆయకట్టు రైతుల పొలాలు బీడులుగా మారుతున్నాయి. ఆయకట్టు కింద ఆయకట్టు సుమారు 200 ఎకరాలుండగా.. కనీసం 20 ఎకరాలకు కూడ నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో చెరువుల మరమ్మత్తులు జరుగుతాయని రైతులు ఎంతో ఆశతో ఎదురు చుశారు.కాని చెరువుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే చందంగా ఉందని ఆయకట్టు రైతులు అంటున్నారు.పాలకులు, ప్రభుత్వాలు మారిన రైతుల భతుకులు మారడం లేదని వాపోతున్నారు.కనీసం కాకాతీయ మిషన్ నిధులతో నైన కాలువలు మరమ్ముత్తులు చేయాలని పెద్దేముల్, తింసాన్‌పల్లితో పాటు పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

200 ఎకరాల ఆయకట్టు.. 20 ఎకరాల సాగు

పెద్దేముల్ పెద్ద చెరువు కింద సుమారు 200ఎకరాల ఆయకట్టు ఉన్నా కనీసం 20 ఎకరాలకు కూడా సాగునీరు అందించడం లేదని రైతులు వాపోతున్నారు. రూ.కోటి నిధులతో చేపట్టిన మిషన్ కాకతీయ పనుల్లో చెరువుల పూడిక తీత, అలుగు, కట్ట మరమ్మతులకే పరిమితమవుతున్నాయంటున్నారు. కాల్వలు మరమ్మతుకు నోచుకోక అధ్వానంగా మారాయని.. ప్రతీ ఏడు చెరువు నిండా నీరున్నా సాగుకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వలు కబ్జా

పెద్ద చెరువు ఆయకట్టు కాల్వలు అంతకంతకూ కుంచించుకు పోతున్నాయి. వాటి మరమ్మతును పట్టించుకోకపోవడంతో కబ్జాలకు గురవుతున్నాయి. ఇదే విషయాన్ని సంబధిత ఇరిగేషన్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరపణలు వెల్లువెత్తుతున్నాయి.

“ప్రతిపాదనలు సిద్ధం



పెద్దేముల్ పెద్ద చెరువు కాల్వలు అధ్వానంగా మారాయని ఆయకట్టు రైతులు తమ దష్టికి తెచ్చారు. ప్రభుత్వానికి పంపించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం, నిధులు రాగానే పనులు మరమ్మతు పనులు ప్రారంభిస్తాం. ఉపాధి హామీ పనుల్లో కాల్వల్లోని కంప తొలగించవచ్చు.

– నవీన్, ఇరిగేషన్ ఏఈ, పెద్దేముల్

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


పరిగి: మైనార్టీ బంధు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 54మందికి మంజూరైన మైనార్టీ బంధు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నాడన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న ఘతన బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. పక్క రాష్ట్రాల ప్రజలు మన పథకాల అమలుకు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్‌మహమ్మద్, మార్కెట్‌కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ ఎంపీటీసీ సభ్యుడు రాంలాల్ నాయక్ తండ్రి దేవుజానాయక్ ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి వారి ఇంటికివెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేరిరాంరెడ్డి, నాయకులు రాజప్ప, బాలయ్య, చిలకల శంకర్, పులింగ వెంకటేష్, మహేశ్వరం రాములు, కొండయ్య స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎనిమిది మంది ఎవరో..?

- ఎనిమిది వైన్ షాపులకు 275 దరఖాస్తులు
- రేపు కలెక్టరేట్‌లో లక్కీడ్రా

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో ఎనిమిది వైన్ షాపులకు 275 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించిన వ్యాపారులు సోమవారం డ్రాలో పాల్గొనున్నారు. ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా ఉంటుందని కొడంగల్ ఆబ్కారీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని వైన్‌షాప్‌కు అత్యధికంగా 75 మంది దరఖాస్తు చేసుకున్నారు. దుద్యాలకు 50, గోకాపస్లావాద్‌కు 28, దౌల్తాబాద్‌కు 22, రావులపల్లికి 26, కొడంగల్‌లోని షాప్‌నంబర్ 52కు 22 మంది, షాప్ నంబర్ 53కు 26 మంది, షాప్ నంబర్ 54ను 26 మంది దరఖాస్తు చేసుకున్నారు. 275 మందిలో 8 మందికి మాత్రమే అదృష్టం వరించనుంది.

ప్రేమ వేధింపులకు బాలిక బలి

- హాజీపూర్‌లో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు


ప్రవలిక (ఫైల్)

యాలాల: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధించడంతో మనస్తాపానికి గురైన బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని హాజీపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన బుర్జుకాడి వెంకటమ్మ, రాములు దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో పెద్ద కూతురు ప్రవలిక (17) పదో తరగతి చదువుతోంది. ఇదే గ్రామానికి చెందిన కమాలి రాజు కొంతకాలంగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ప్రవలికను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాజు వేధింపుల కారణంగానే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరోసారి పిచ్చి కుక్కల వీరంగం

- ఇద్దరికి గాయాలు
- ఆందోళనలో రేగడిమైలారంలో గ్రామస్తులు


పిచ్చికుక్కను చంపిన రైతులు


గాయపడిన ఎల్లప్ప,


అనంతయ్య

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో పిచ్చికుక్కలు మరోసారి స్వైర విహారం చేశాయి. వారం రోజుల క్రితం ఒకే కుక్క 12 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన విషయం తెలిసిందే. ఈ కుక్క గ్రామంలోని పలు వీధి శునకాలను సైతం కరవడంతో అవి కూడా పిచ్చి పట్టినట్లు వ్యవహరించాయి. శనివారం పొలం వద్ద ఉన్న తలారి అనంతయ్య, తలారి ఎల్లప్పతో పాటు రెండు ఎద్దులను కరిచాయి. బాధితులు వెంటనే కొడంగల్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఆదివారం హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లనున్నారు. దాడిచేసిన పిచ్చి కుక్కల్లో ఒకదాన్ని రైతులు చంపారు. శునకాలు ఇలా దాడులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చిట్టెపు నర్సిరెడ్డి, తలారి శేఖర్, నెల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

రెచ్చిపోయిన దుండగులు


బాధితుడి ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

- ఎన్కేపల్లిలో ఒక ఇంట్లో చోరీ.. మరో రెండు ఇళ్లలో విఫలయత్నం
- మూడు తులాల బంగారు ఆభరణాలు మాయం

పూడూరు: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో దుండగులు రెచ్చిపోయారు. శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ చేయగా.. మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. చన్గోముల్ ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఎంకుల శ్రీనివాస్ భార్య పుట్టింటికి వెళ్లడంతో ఆయన ఇంటికి తాళం వేసి అంతారం శివారులోని శ్రీచక్ర డెయిరీలో కూలీకి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లి ఇంట్లోని వస్తువులు చిందరవంరగా పడవేసినట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. గ్రామంలోని మోనాచారి, సత్తయ్య ఇళ్లలోనూ చోరీకి యత్నించాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీకి కేఎస్ఆర్ రాజీనామా


శరత్‌కుమార్‌రెడ్డి

దోమ: బీజేపీ పరిగి నాయకుడు, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఆయన రాసిన లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. స్థానిక నాయకులను కాదని, పక్క జిల్లాలు, నియోజకవర్గాల నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అనేక సేవా కార్యక్రమాలతో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్న తనకు తగిన గుర్తింపు దక్కడం లేదని, అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా శరత్‌కుమార్‌రెడ్డి త్వరలోనే కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు స్థానికంగా చర్చ మొదలైంది.

భద్రతాభావం పెంచేందుకే కవాతు


పరిగిలో ఆర్ఏఎఫ్ కవాతు

డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

పరిగి: ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకే పట్టణంలో కవాతు నిర్వహిస్తున్నట్లు పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో పలు మూడు కిలోమీటర్ల వరకు 75 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీం కవాతు నిర్వహించింది. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో విపత్కర పరిస్థితుల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సేవలు అందించేందుకు ముందుంటుందన్నారు. ఆర్ఏఎఫ్ అనేది అత్యవసర సమయాల్లో స్థానిక పోలీసులకు అండగా ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ డీఎస్పీ రాహుల్, సీఐ వెంకటరామయ్య, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలిస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలకు వివరించాలని సూచించారు. గతంలో నియోజకవర్గ పరిధిలో 42వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే వరంగల్ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని వివరించాలని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీతో పాటుగా నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, ప్రేమలత, తార్యానాయక్, సురప్ప, బందయ్య, రాజాపుల్లారెడ్డి, యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి రాగి జావ తప్పనిసరి

తాండూరు ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికి రాగి జావ తప్పక అందించాలని తాండూరు ఎంఈఓ వెంకటయ్య అన్నారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో మెనూతో పాటుగా నాణ్యత తప్పక పాటించాలని సూచించారు. అనంతరం మధ్యహ్న భోజనం మెనూ బ్యానర్లను ఆవిష్కరించి హెచ్ఎంలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మృత్యుంజయస్వామి, వైద్యనాథ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై న్యూసెన్స్ కేసు నమోదు


నిందితుడిని బైండోవర్ చేస్తున్న డీటీ సురేశ్

కొడంగల్: మండల పరిధిలోని పెద్ద నందిగామకు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు శనివారం రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ శివ తరచూ స్థానికులతో గొడవపడుతూ.. నిత్యం భయాందోళనలు సృష్టిస్తున్నాడు. ఇతనిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసిన పోలీసులు డీటీ సురేశ్ ఎదుట హాజరు పర్చారు. మరోసారి ఇలాంటి వ్యవహారాలకు పాల్పడితే సదరు వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని డీటీ హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ కేటగిరి లో ఎంపీసీ గ్రూపులో ఏడు సీట్లు, బీసీ–ఈ కేటగిరిలో ఒక సీటు, బైపీసీ గ్రూప్ ఎస్సీ కేటగిరిలో ఒక సీటు, బీసీ కేటగిరిలో ఒక సీటు, బీసీ–ఈ కేటగిరిలో ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల లోపు కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ల 9704550225, 08412– 2223111లో సంప్రదించాలని కోరారు.

ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ చిత్రహింసలకు గురిచేసిన ఎల్‌బీ నగర్ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ.రమేశ్ బాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహిళను స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన పోలీసులను విధుల నుంచి తొలగించాలని.. బాధితురాలు లక్ష్మీబాయి కుటంబాన్ని అన్ని విధాల ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్‌నాయక్, తార్యానాయక్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా నాయకులు దస్తప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రావణ’ సందడి


విశేష అలంకరణలో స్వామివారు

పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణ మాసం తొలి శనివారం కావడంతో అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– కొడంగల్


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు